ప్రజాశక్తి
సోమవారం 28 జులై 2025 5 అనంతపురం

కూతుళ్లకు విషగుళికలిచ్చి తండ్రి ఆత్మహత్యాయత్నం

భార్యతో చిన్నపాటి వివాదమే కారణం

బెళుగుప్ప: కుటుంబ కలహాలతో తండ్రి, ఇద్దరు కూతుర్లు విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బెళుగుప్ప మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు... నక్కలపల్లికి చెందిన రైతు రమేష్ రెడ్డికి భార్య దివ్య, ఆరు సంవత్సరాల కుముద్విని, మూడుసంవత్సరాల చైత్ర అనే కూతుళ్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రమేష్‌రెడ్డి, అతని భార్య కుటుంబసమస్య మీద చిన్నపాటి గొడవ పడ్డారు. ఈ సమయంలో తీవ్ర మనస్థాపానికి గురైన రమేష్‌రెడ్డి తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని తోటలోకి వెళ్లాడు. అక్కడి వెళ్లి తన ఇద్దరు కూతుళ్లకు విషపు గుళికలు మింగిచ్చాడు. అనంతరం రమేష్‌రెడ్డి కూడా విషపుగుళికలు మింగాడు. అపస్మారక స్థితిలో పడిఉన్న తండ్రీ కూతుళ్లను చుట్టుపక్కల ఉన్న తోటలోని వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

కాల్‌మనీ ఆగడాలు

ఉమ్మడి జిల్లాలో శృతిమించుతున్న అరాచకాలు

మొన్న అనంతలో... ఇప్పుడు ధర్మవరంలో..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేదల అవసరాలకు అధిక వడ్డీలకు అప్పులివ్వడం..ఇవ్వకపోతే దాడులు చేయడం వంటి ఘటనలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్నాయి. మొన్న అనంతపురం నగరంలో కాల్ మనీ గ్యాంగ్ ఆగడాలు వెలుగుచూడగా నేడు ధర్మవరంలో వెలుగులోకి వచ్చాయి. వారానికి పది రూపాయలు వడ్డీకి అప్పులిస్తూ జలగల్లా పేద ప్రజలన పట్టిపీడిస్తున్నారు.

ధర్మవరంలో వెలుగులోకి వచ్చిన కాల్‌మనీ అరాచకాలు

రాజ్ అనే వడ్డీ వ్యాపారి గ్యాంగ్ ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన రమణ అనే వ్యక్తిఇంట్లోకి దూరికొట్టిన వీడియోలు వైరల్‌గా మారాయి. రమణ కొద్ది రోజుల క్రితం రాజా వద్ద నుంచి రెండు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు. మరో ఇద్దరి వ్యక్తులకు అప్పు ఇప్పించాడు. మొత్తం ఆరు లక్షల రూపాయలకు పూచి పడ్డాడు. ఇప్పటికే రూ.15 లక్షలకుపైగా వారికి చెల్లించాడు. కాని ఇంకా డబ్బు ఇవ్వాలంటూ రాజా గ్యాంగ్ రమణ ఇంట్లోకి దూరి చావబాదారు. ఇంట్లో మహిళలు, చిన్న పిల్లలు కేకలు పెడుతున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా కర్కశంగా దాడి చేశారు. ఈ సంఘటన ఈనెల 23వ తేదీ జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలోనూ రాజా గ్యాంగ్ ఇదే రకంగా వ్యవహరించి జైలుకు కూడా వెళ్లివచ్చింది. ఇలా వరుస ఘటనలు చోటు చేసుకున్నా రాజా గ్యాంగ్ ఆగడాలు మాత్రం ఆగడం లేదు. కూతురు వివాహం కోసం దాచుకున్న డబ్బులిచ్చినా రాజా గ్యాంగ్ కనికరం లేదని బాధితుడి భార్య భారతి వాపోయింది. కొంత గడువు ఇస్తే అసలు మొత్తం చెల్లిస్తామని చెబుతున్నా రాజా మనుషులు ఇంటికొచ్చి దాడి చేశారని బాధితుడు రమణ తెలిపాడు.

అనంతలోనూ ఇదే తీరు

అనంతపురం నగరంలోనూ పాతూరులో ఇదే రకమైన గ్యాంగ్‌లు నడుస్తున్నాయి. రోజు వారి వడ్డీ, వారం వడ్డీలకు అప్పులిచ్చి పేద ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నారు. సకాలంలో డబ్బులు చెల్లించలేదనే నగరంలోని వీధుల్లోనే బాహాటంగా దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బయటకు పొక్కడంతో పోలీసులు స్పందించి వడ్డీ వ్యాపారులకు హెచ్చరికలు కూడా చేశారు. అయినా ఈ గ్యాంగ్‌ల తీరులో మార్పులేదన్న విమర్శ ఉంది. రోజు వారీ, వారం అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. కట్టకపోతే ఇళ్ల వద్దకెళ్లి దాడులు చేస్తున్నారు. అయితే ఇందులో చాలా తక్కువ కేసులే బయటకొస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి తలొగ్గి బయట చెప్పుకునేందుకు కూడా భయపడుతుండటం గమనార్హం.

ఉభయసభల మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా 'దగ్గుపాటి'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉభయ సభల సంయుక్త కమిటీల్లో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు చోటు దక్కింది. ఉభయ సభల మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యులుగా దగ్గుపాటిని నియమిస్తూ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకుల, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం పని చేసే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని వీరికి సాయం చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

మొక్కలను బతికించుకోవాలని..

డబ్బాలతో పంటకు నీరు -కష్టపడుతున్న రైతులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

డబ్బాలతో నీరు పోస్తున్న మహిళా రైతులు

అరకొరగా పడిన వర్షాలకు పత్తిమొక్కలు మొలకరాకపోవడంతో ఎలాగైనా బతికించుకోవాలని రైతులు తపన పడుతున్నారు. మండల వ్యాప్తంగా కొంతమంది రైతులు అరకొరగా పడిన వర్షాలకు రైతులు పత్తి, ఇతర పంటలను సాగు చేశారు. వారందరికీ వరుణుడు జాడ కనిపించకపోవడంతో కష్టాలు మొదలయ్యాయి. అరకొర పదునుకు మొలకలు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈనేపథ్యంలో మొక్కలను ఎలాగైనా బతికించుకోవాలని నానా ఇక్కట్లు పడుతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం మండల పరిధిలోని లక్షుంపల్లి గ్రామంలో మహిళా రైతులు బిందెలతో నీటిని తీసుకొచ్చి మెక్కలకు నీరు అందించారు. కనీసం ఈమాసంలోనైనా వర్షం కురవాలని, లేకపోతే పత్తిపంటకు స్వస్తి చెప్పే పరిస్థితులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

రాష్ట్రంలో అప్పులు అధికం.. అభివృద్ధి శూన్యం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

రాష్ట్రంలో అప్పుల అధికమయ్యాయని అభివృద్ధి శూన్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడి పరిపాలన ఎలాంటి మార్పు లేదని అన్నారు చంద్రబాబు నాయుడు సంవత్సర కాలంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ప్రధానమంత్రిని, హోం, ఆర్థికశాఖ మంత్రులను పలుమార్లు కలిసి అర్జీలు సమర్పించారన్నారు. ఆయా పర్యటనల్లో సిఎం వారిని ఏమి కోరారు, వారు ఏం హామీ ఇచ్చారో చెప్పడం లేదన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబల్ ఇంజన్ సర్కార్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏది సాధించిందో చెప్పాలన్నారు. విభజన హామీలు, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కడప స్టీల్ ప్లాంట్ గురించి ఏమీ మాట్లాడడం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి జిందాల్ అంటే చంద్రబాబునాయుడు జిందాల్ అంటున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను పక్కాగా ప్రవేట్ వారికి అప్పగిస్తుంటే దానిని ఆపలేకపోతున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్లో 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడంతోపాటు 1,400 మంది పర్మినెంట్ కార్మికులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపించారన్నారు. పోలవరం నిర్మాణ విషయంలో మరింత అన్యాయం జరుగుతోందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ. 31 వేల కోట్లు అప్పు చేశారని మరో రూ. 31 వేల కోట్లు అప్పు తేవడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని అప్పులు ఆంధ్రప్రదేశ్ మూడు నెలల కాలంలో రూ.37 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై సమగ్రమైన చర్చలు జరగాలన్నారు. ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచడం లేదని చెప్పి అధికారంలోకి రాగానే రూ. 15వేల480 కోట్లు ట్రిప్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలగొట్టాలని చెప్పిన పెద్దమనిషి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బలవంతంగా బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లను ఎవరైనా బిగించడానికి వస్తే ప్రజలు వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

రూ. 3500 కోట్ల మద్యం దోపిడీని రికవరీ చేయాలి : మద్యం కుంభకోణంలో రూ. 3500 కోట్లు గత ప్రభుత్వం దోపిడీ చేసిందని కూటమి ప్రభుత్వం చెబుతోందని ఈ నేపథ్యంలో 12 మందిపై కేసులు పెట్టిందని అన్నారు. అరెస్టు చేసిన వారిపై నిజాలను నిగ్గు తేల్చకుండా.. సిట్, కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో కాలగర్భంలో కలిపేస్తారని ప్రజలు అనుమానపడుతున్నారన్నారు. ఈ కేసులో నిజాలను నిగ్గు తేల్చి చిత్తశుద్ధితో ప్రజాధనాన్ని రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్, పుట్టపర్తి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి పి. నారాయణస్వామి, జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు జె. రాజారెడ్డి, అనంతపురం నగర సిపిఐ కార్యదర్శి ఎన్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారుల గుండెల్లో గుబులు

ఇప్పటికే ఏసీబికి చిక్కిన పలువురు ఉద్యోగులు

తాజాగా ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ భాగోతం

అవినీతి మత్తు వీడని యంత్రాంగం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సబ్ రిజిస్టర్ కార్యాలయం

కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి ఏసీబీకి ట్రాప్ కావడం, గతంలో కొందరు ఇక్కడి అధికారులు ఏసీబీ వలలో ఇరుక్కున్న సంఘటనలు గుర్తు తెచ్చుకుంటున్న ఇప్పటి అవినీతి అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. దశాబ్దాల కాలంగా కళ్యాణదుర్గం నియోజవకర్గంలో ఏసీబీ దాడుల్లో దొరికిపోయిన అధికారుల తతంగాలను గుర్తుచేసుకుంటూ తమకు ఎలాంటి ఇబ్బందులెదురవుతాయోనని వారు ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. భూ పోరాటాలకు పురిటిగడ్డగా పేరొందిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అవినీతిలో మునిగిపోయిన అధికారులు ఈప్రాంతానికి మచ్చతెచ్చి పెట్టారు. మంచికి మారుపేరైన ఈ ప్రాంతంలో రానురాను రాజకీయ పరిస్థితులు మార్పు కారణంగా అవినీతి అధికారులకు అందలం లభిస్తోంది. చివరికి అవినీతి మత్తులో మునిగిపోయి ఏసీబీ ట్రాప్‌లో ఇరుక్కుపోతున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ రూ.5లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడడంతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే పలు పనుల కోసం అవినీతికి పాల్పడిన రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలలో పనిచేసే అధికారుల్లో లోలోపల కంగారు కనిపిస్తోంది. తాము ముడుపుల కోసం వేధిస్తున్న వ్యక్తుల నుంచి ఏసీబీ ముప్పు పొంచివుందేమోననే ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా కళ్యాణదుర్గం పోలీస్, రెవెన్యూ శాఖలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది.

రెవెన్యూ, పోలీస్ శాఖలలో అవినీతి కంపు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పనిచేస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖలలో అవినీతి కంపుకొడుతోంది. పోలీస్ శాఖలో ఉన్నతస్థాయి అధికారి తనస్థాయిని మరిచి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. వివిధ సెటిల్‌మెంట్లు, పెద్ద కేసుల పరిష్కారం, స్టేషన్ల తనిఖీ సమయంలో ముడుపులు, వివిధ అక్రమమార్గాల ద్వారా లబ్ధి పొందే వర్గాల నుంచి నెలసరి ఆదాయాలు లక్షల రూపాయల్లో అందుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన ఆధీనంలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులు సైతం అవినీతిలో మునిగిపోయారు. బాధితులు ఏదైన సంఘటనపై ఫిర్యాదు చేస్తే నాన్చుడు ధోరణి వ్యవహరించడం, దుప్పటి పంచాయితీలు నిర్వహించి కేసులు నీరుగార్చే పనిలో నిమగ్నమైనట్లు విమర్శలున్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళలను వేధిస్తున్న కేసుల్లో ముడుపులు తీసుకుని చిన్నస్థాయి కేసులు నమోదు చేసి 41-నోటీస్ జారీ చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించిన సంఘటనలు కొక్కల్లలున్నాయి. ఓ పోలీస్ సర్కిల్‌లో వరుస చోరీలు జరుగుతున్న కేసులు నమోదు కాలేదు. ఈవిషయమై బాధితులు ఓ పోలీస్ అధికారిని సంప్రదిస్తే చూస్తాం, చేస్తాం అంటూ దాటవేసే ధోరణి అవలంభిస్తున్నట్లు బాధితుల నుంచి విమర్శలు వినపడుతున్నాయి. ఇదే తరహాలోనే మరికొంతమంది ఎస్‌హెచ్‌ఒలు వారి పరిధిలో ప్రతి కేసులోను చేతులు తడపనిదే పరిష్కారం చూపడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారిపై కూడా ఏసీబీ కన్ను వుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇక రెవెన్యూ శాఖలో అవినీతి తతంగం అంతాఇంతాలేదు. గ్రామకంఠాల స్థలాలు రిజిస్ట్రేషన్‌ల కోసం జారీ చేసే ధ్రువీకరణ పత్రాల జారీకి ఏకంగా ధరలను నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. కనీస పరిజ్ఞానం లేని వ్యక్తులు డాక్యుమెంట్ రైటర్లుగా కేంద్రాలు ఏర్పాటు చేసుకుని ఫోర్జరీ సంతకాల తతంగాలను మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఏకంగా తహశీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసిన సంఘటనలు వెలుగుచూడగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇంత వరకు కేసులు నమోదు కాలేదంటే రెండు శాఖల మధ్య అవినీతి సమన్వయం ఏస్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. పలువురు తహశీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్‌వోలు అధికార పార్టీ నేతల ఆదేశాలనుసారం నడుచుకుంటున్నట్లు విమర్శలున్నాయి. ఇందులో భాగంగానే అడంగల్ మార్పులు, సర్వేలకు ముడుపులు అందకపోతే పనులు ముందుకు సాగడం లేదు. పనులకోసం వెళ్లిన వారిని వేధిస్తున్న సంఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయి. ఇలా విసిగిపోయిన బాధితులు ఏసీబీని ఆశ్రయించే ఆలోచనలో పడ్డారు. ఇక నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా ఏసీబీ ట్రాప్ అయిన అధికారులను పరిశీలిస్తే పదుల సంఖ్యలోనే ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం కళ్యాణదుర్గం ఎమ్మార్వో సురేష్‌కుమార్ ఏసీబీకి పట్టుబడ్డారు. అనంతరం వీఆర్‌వో నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారెప్ప, బ్రహ్మసముద్రం ఆర్ఐ వెంకటేశులు (ప్రస్తుత ఆర్డీఓ కార్యాలయ డీటీ), సర్వేయర్ హేమసుందర్, కుందుర్పి మండలంలో ఓ వీఆర్‌వో, శెట్టూరు మండలంలో మరో వీఆర్‌వో, ఇటీవల కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి ఏసీబీకి పట్టుబడిన వారిలో ఉన్నారు.

అనంతలో సినీనటి నిధి అగర్వాల్ సందడి

చందన షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి అనంతపురం

చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సినీనటి నిధి అగర్వాల్

స్థానిక ఐరన్ బ్రిడ్జి సమీపంలో ధర్మవరం రోడ్డులో నూతనంగా నిర్మించిన చందన షాపింగ్ మాల్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 40 అనుబంధం కలిగిన చందన సరికొత్తగా రూపాంతరం చెంది చందన షాపింగ్ మాల్‌గా అనంతపురంలో నెలకొల్పడం మంచి పరిణామమని అన్నారు. షాపింగ్ మాల్‌లో మహిళలకు కావాల్సిన అన్ని రకాల పట్టు, ఫాన్సీ, డిజైనర్ వర్క్ శారీస్, పట్టు లంగాలు, చుడిడార్స్, డ్రెస్ మెటీరియల్, గాగ్రాస్, వెస్టన్ వేర్, మెన్స్ బ్రాండెడ్ రెడీ మేడ్స్, వెడ్డింగ్ కలెక్షన్స్ వంటి వేలాది వెరైటీలు తక్కువ ధరకు లభ్యమవుతున్నాయన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ 40 సంవత్సరాల అనుబంధం ఉన్న చందన ఇపుడు చందన షాపింగ్ మాల్ గా రూపాంతరం చెంది మావూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో వారి కుమారులు ఎంవి. సంతోష్ రాం మోహన్, ఎంవి గణేష్ ఆధ్వర్యంలో అనంతపురంలో సరికొత్త హంగులతో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హీరొయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ ఎంతో గుర్తింపుపొందిన చందన షాపింగ్‌మాల్ తన చేతుల మీదుగా ప్రారంభం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్. మురళీధర్, కార్పొరేటర్ సి. బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన హీరోయిన్ నిధి అగర్వాల్

అనంతపురంలో చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన హరిహర వీరమల్లు సినిమా హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి చేశారు. కొన్ని సినీ పాటలకు డాన్స్ చేసి ప్రజలను ఉత్సాహ పరిచారు. చందన షాపింగ్ మాల్ ప్రారంభ సందర్భంగా అనేక ఆఫర్లు ఉన్నాయని వాటిని అనంతపురం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులు, యువత క్రీడలపై దృష్టి సారించాలి

జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయభాస్కర్

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని యువత ఆటలు ఆడకపోతే ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని, అందుచేత విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా ప్రతిభ కనబరిస్తే ఎంతో మేలు జరుగుతుందనిశ్రీ సత్యసాయి జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : ఉమ్మడి జిల్లాలో క్రీడా వికాస కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? వాటి వలన ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ?

జవాబు: ఉమ్మడి జిల్లాలో క్రీడా వికాస కేంద్రాలు 14 ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 7, శ్రీ సత్య జిల్లాలో ఏడు ఉన్నాయి. పెనుగొండ, మడకశిర ,ధర్మవరం కేంద్రాల పనులు పూర్తి అయ్యాయి. కొత్తచెరువులో స్టేడియం పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఆయన వాటికి నిధులు వెంటనే మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిధులు మంజూరు అయితే పనులు పూర్తి చేస్తాం.

ప్ర : కేంద్రం నుండి క్రీడాకారులకు వచ్చే నిధులు ఏవేవీ ?

జ : కేంద్ర ప్రభుత్వం నుండి రెండు విధాలుగా నిధులు మంజూరు అవుతాయి. దాతలు స్థలం చూపితే వారు నిర్మాణాలు చేపట్టి స్టేడియంలో నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి అనుమతులు మంజూరు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ధర్మవరంలో హాకీ ఆటస్థల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. డే బోర్డర్ స్కీం కింద ఆట వస్తువులను అందజేయడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ప్ర : క్రీడాకారులకు ఏయే ప్రోత్సాహకాలు ఇస్తున్నారు ?

జ : గతంలో క్రీడాకారులకు జీవో నెంబర్ నాలుగు ద్వారా గ్రూప్ వన్ ఉద్యోగాలు సైతం వచ్చేవి. ప్రస్తుతం ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది. ఎలాంటి అర్హత లేకున్నా రాష్ట్ర క్రీడాకారుల కోటాలో ఈ నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 425 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. పరీక్షలు రాయకుండా ఉద్యోగం పొందవచ్చు, వ్యాయామ ఉపాధ్యాయునిగా ఎక్కడ నుంచి అయినా దరఖాస్తు చేసుకుని ఉద్యోగం పొందవచ్చు అనంతరం పీఈటీ కోర్సు పూర్తి చేసుకోవచ్చు.

ప్ర : జిల్లాలో క్రీడాకారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : సత్యసాయి జిల్లాలో క్రీడాకారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్క ఆటకు ప్రాధాన్యత కల్పించి అక్కడ క్రీడాకారులను ప్రోత్సహించి వాటిలో ప్రతిభ కనబరిచే విధంగా చర్యలు చేపడుతున్నాం. ధర్మవరం ప్రాంతంలో బాక్సింగ్, హాకీ ఆటలకు ప్రాధాన్యత కల్పించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అదేవిధంగా కదిరి ఫెన్సింగ్ (కత్తి యుద్ధం) ,పెనుగొండ షటిల్ బ్యాట్మింటన్, హిందూపురం, రామగిరి అథ్లెటిక్, పుట్‌బాల్ తదితర ఆటలకు ప్రోత్సహిస్తూ వారికి తగిన ప్రోత్సాహం ఇస్తున్నాం.

ప్ర : వికలాంగులకు క్రీడారంగంలో అవకాశం కల్పిస్తున్నారా?

జ : వికలాంగులు క్రీడలలో రాణించడానికి వారికి అవకాశం కల్పిస్తూ శిక్షణ ఇస్తూ క్రీడల పట్ల ఆసక్తి కలిగేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. చదువుతోపాటు క్రీడల పట్ల విద్యార్థులను ఆసక్తి కలిగించే విధంగా ప్రోత్సహిస్తున్నాం.

పదవి అంటే అధికారం కాదు.. బాధ్యత..

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

పదవి అంటే అధికారం కాదని.. బాధ్యతగా భావించి సేవకుడిగా పని చేస్తూ ప్రజలు, రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే గుమ్మానూరు అధ్యక్షతన మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నాయన్నారు. ఆ దిశలో మార్కెట్ యార్డు కమిటీ పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు దక్కుతాయన్నారు. పదవి అంటే అధికారం కాదని.. ఒక బాధ్యతగా గుర్తుంచుకోవాలన్నారు. సిఎం చంద్రబాబు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు ఇస్తారన్నారు. ఇందులో భాగంగానే మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ పదవిని ఎస్టీ మహిళ సుగాలి లక్ష్మీదేవికి కేటాయించారన్నారు. అదేవిధంగా కురుబ సామాజిక వర్గాలకు చెందిన రామప్పకు వైస్‌ఛైర్మన్ పదవి ఇచ్చారన్నారు. వీరితో పాటు కమిటి సభ్యులందరూ గ్రామగ్రామాన తిరిగి రైతుల సమస్యలు తెలుసుకుని తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మండల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి.?

ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకుంటే ఎలా బతకాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బదిలీలో నిర్వహించిన నేటికి నెల రోజులకు పూర్తి కావస్తున్నా జూన్ నెల జీతాలు చెల్లించలేదన్నారు. జూలై మాసపు జీతం కూడా క్లైమ్ చేసే పరిస్థితుల్లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. దీంతో చాలామంది ఉపాధ్యాయులు ఇంటి అద్దె కట్టలేక నెలసరి ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని జీతాల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు బదిలీ పేరుతో ఆగిన ఉపాధ్యాయులను త్వరగా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు 12వ పిఆర్‌సి నియమించినా 30శాతం తగ్గకుండా మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. అలాగే డిఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పదవ తరగతి మూల్యాంకనం విధులు, నూరు రోజుల ప్రత్యేక తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సిసిఎల్, సంబంధిత సెలవులు మంజూరు చేయాలని, విద్యాశక్తి కార్యక్రమాన్ని తప్పనిసరి కాకుండా ఉండేలా ఉత్తర్వులు డిమాండ్ చేశారు.

'భాష్యం'లో పేరెంట్స్ డే

ప్రజాశక్తి-అనంతపురం

ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నగరంలోని జీసస్ నగర్‌లో ఉన్న భాష్యం విద్యాసంస్థల్లో పేరెంట్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సిఇఒ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జీవితంలో తల్లిదండ్రుల పాత్ర ప్రాముఖ్యత, అవశ్యకతను వివరిస్తూ ప్రసంగాన్ని సాగించారు. ఈరోజుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు చరవాణి ఇచ్చి ఆడుకోమని చెబుతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు రోజు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు మొదటి గురువు తల్లి అని, 2వ గురువు తండ్రి అని, తర్వాత విద్య నేర్పిన ఉపాధ్యాయుడు అన్నారు. కనుక ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. వారి కష్టాలను తెలుసుకుని బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులు కలలను నెరవేర్చాలన్నారు. సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టాలని కోరారు. స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించి తల్లిదండ్రులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, డెరెక్టర్ సాకేత్ రామ్, జిల్లా జెడ్ఆఓ రవివర్మ, ప్రిన్సిపల్ బాలకృష్ణ, హెచ్ఎం షకీలా బేగం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు పల్లెలకూ చేరాలి

ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మాట్లాడుతున్న ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ పోరాట ఫలితంగా లభిస్తున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలు ప్రతిపల్లెకూ చేరాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఇఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ పిలుపునిచ్చారు. ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్ అధ్యక్షతన ఆదివారం కళ్యాణదుర్గంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ఫలాలు అందుకునేందుకు మూడు దశాబ్దాలకు పైగా ఉద్యమాలు జరిగాయన్నారు. వర్గీకరణ సాధన కోసం దేశప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం ఎంతో ఉందన్నారు. అయితే వర్గీకరణ ఫలాలతో గ్రామీణ ప్రాంతాల్లో మాదిగల పిల్లలు ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్, కార్యవర్గ సభ్యులు హనుమంతురావు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, కెపి నగేష్, ఎంపీ ఎర్రిస్వామి, చిరంజీవి, రిటైర్డ్ అగ్రికల్చర్ జేడీ కృష్ణమూర్తి, రిటైర్డ్ ఆర్డీఓ వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు బత్తల మారుతీప్రసాద్, కుటుంబ సభ్యులు

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, ఆనాథాశమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తల మారుతీప్రసాద్ ఆయన సతీమణి మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. మారుతీప్రసాద్ అత్త వడ్డే రాములమ్మ వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధ, అనాథాశ్రమ నిర్వాహకుడు జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II nd ADDL JUNIOR CIVIL JUDGE ANANTHAPURAMU
O.S.No: 1417/2023

Between:
S.Imam Hussain ...**Plaintiff**
And
Y.Obulesu ...**Defendant**

Notice to the Defendant

To,
Y.Obulesu S/O Y.Pothanna Hindu major business residing at D.NO.5/50 Sundaraiah colony/Jakeer Kottalu Anantapuramu town

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 19-08-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.VISWANATHAREDDY,
I.SESHU REDDY,
Advocates, Anantapuramu, Cell:9440351523

మహిళకు కరపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

గుత్తి : సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని 23వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బోయ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 23వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.సురేష్ బాబు, నారాయణ, వేల్పుల రంగస్వామి, వడ్డే రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

In The Court of the Honible District Judge, Anantapuramu
A.S.No :72/2024

Between:
Y.Tippa Reddy & 2 others ...**Appellents**
And
1.Pala Sivama died by L.Rs
2.Pala Lakshmi Devi And others ...**Respondants**

Notice to Respondants No2 and 4 to 10

R2: P. Lakshmidevi W/o Papammagari Narayana Reddy Residing at pulakurthi (V) D.Hirehal (M) Anantapuramu (Dist)
R4: Pala Yerriswamy S/o Late Pala Vannurappa
R5: Pala Sivalinga S/o Late Pala Vannurappa
R6: Pala Laleppa S/o Late Pala Vannurappa
R7: Pala Nijagara S/o Late Pala Vannurappa,
R8: Pala Parvathi D/o Late Pala Vannurappa,
R9: Pala Lalithamma D/o Late Pala Vannurappa
R10: Pala Ambamma D/o Late Pala Vannurappa
Respondents 4 to 10 residing at C/o Pala Yerriswamy, Hosuguddam (V) Pulakurthi Panchayat, D.Hirehal (M), Anantapuramu (Dist)

ఇందుమూలంగ తెలియజేయడము ఏమనగా ప్రతివాదులు Respondents No 2 and 4 to 10 పై కోర్టు మీ హాజరు నిమిత్తం 11-08-2025వ తేది వాయిదా వేసి వున్నారు. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు ఏమైన అక్షేపణలు ఉన్న యెడల స్వతహగా కాని మీ వకీలు ద్వారా కాని హజరై పై కోర్టు నందు దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By Court Order)
L.Prabhakar Reddy
Advocate, Ananthapuramu

తాగునీటి కోసం పైపులైను ఏర్పాటు

ఉరవకొండ : ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణంలోని నెహ్రూ కాలనీలో తాగునీటి కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నెహ్రూ కాలనీలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను పయ్యావుల సోదరుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నూతన పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పేరం కేశవానంద, బాబు, బూత్ కన్వీనర్ పెద్దిరెడ్డి, నరేష్, కో కన్వీనర్ మోపిడి రఫీ, నూర్, వడ్డే శివ, సురేష్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నాయకులు

పోరాటాలతోనే మహిళా రక్షణ చట్టాల అమలు

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల

ప్రజాశక్తి-గుంతకల్లు

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల

పోరాటాలు చేయడం ద్వారానే మహిళా రక్షణ చట్టాలను అమలు చేసుకోగలమని ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్యామల పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కాలనీలో 5వ ఐద్వా పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు,హత్యలు, దాడులు పెరిగిపోయాయన్నారు. ఎప్పుడో నాశనమైన మనువాదాన్ని తీసుకురావడానికి బిజెపి ప్రయత్నం చేస్తోందన్నారు. మనువాదం వల్ల మహిళలు అణగదొక్కబడతారన్నారు. స్త్రీ, పురుషుల మధ్య విభేదాలు పెరిగిపోతాయన్నారు. దేశంలో ఎక్కడ చూసిన మహిళలపై అత్యాచారాలు, హత్యలు చిన్నపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయ న్నారు. నిర్భయ, పోక్సో వంటి మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, కుల, మతాల పేరుతో జరుగుతున్న దాడులను నివారించాలన్నారు. లేనిపక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జ్యోతి, రంగమ్మ, కమిటీ సభ్యులుగా సుగుణ, షకీరా, లక్ష్మీబాయి, జయమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మి, సాయి, ప్రభావతి, ప్రమీల, సరస్వతి, చిన్నలక్ష్మి, డి.ఆదిలక్ష్మిని ఎన్నుకున్నారు.

12వ పిఆర్‌సి కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలి

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.సురేష్‌కుమార్

ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించడంతోపాటు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీగా ఉంటామని అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఉద్యోగులను పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులు, రిటైర్ అయిన వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించాన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని చెబుతూనే రకరకాల యాప్‌లతో, వివిధ రకాల శిక్షణలు, ఇతరత్రా కార్యక్రమాలు చేయిస్తూ ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి హనుమంతురెడ్డి, ప్రమీల, రవికుమార్, అబ్దుల్ వహాబ్ ఖాన్, సంజీవ్‌కుమార్, శేఖర్, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, వెంకట్రామిరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు గంగాధర్, సబ్ కమిటీ కన్వీనర్ సురేష్‌బాబు, నాయకులు మహమ్మద్ గౌస్, రామాంజనేయులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో 'మోసం గ్యారెంటీ'

వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న వైసిపి నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రజలకు ష్యూరిటీ లేకపోగా మోసం మాత్రం గ్యారెంటీ అని మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్ ఎద్దేవా చేశారు. ఆదివారం నగరంలోని సాయినగర్‌లో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ముఖ్యంగా ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్న నిజాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలిన కూటమి ప్రభుత్వం పాలనను నిలదీయటానికి వైసిపి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గౌస్ బేగ్, మారుతీనాయుడు, జయరామ్‌నాయక్, రవితేజ, పెన్నోబుళేసు, హుస్సేన్ పీరా, షైక్ జావీద్, రాజు, ఖాదర్‌బాషా, నారాయణరెడ్డి, అకీబ్, మహబూబ్‌బాషా, షాల్మియా, సాదిక్, జాకీర్, సయ్యద్ జావీద్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

పుట్లూరు : మండల పరిధిలోని వెంగన్నపల్లి, నారాయణపల్లి, గోపురాజుపల్లి గ్రామాల్లో వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టో ద్వారా ఎంత మేరకు నష్టం జరిగిందో క్యూఆర్ కోడ్ సాయంతో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరసింహారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బెడదల లక్ష్మీనారాయణరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అంబటి రామ్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, మహేష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న హెపటైటిస్ మరణాలు

కిమ్స్ సవీరా కన్సల్టెంట్ డాక్టర్ ఎం.దినేష్-నేడు అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది తమకు తెలియకుండానే హెపటైటిస్‌తో ప్రాణాలు కోల్పోతున్నారని కిమ్స్ సవీరా కన్సల్టెంట్, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎం.దినేష్ అన్నారు. నేడు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సంవత్సరం 'హెపటైటిస్ మనం విడమర్చి ఆలోచించుదాం' అనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. అంటే హెపటైటిస్ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఈ థీమ్ తెలియజేస్తుందన్నారు. హెపటైటిస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 10 లక్షల కంటే ఎక్కువ మంది మరణిస్తున్నారన్నారు. ఈ మధ్యకాలంలో ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు.

ముఖ్యంగా వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

హెపటైటిస్ అనేది ఒక కాలేయ వ్యాధి అన్నారు. సాధారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చి లివర్ కేన్సర్, లివర్ ఫెయిల్యూర్ సహా అనేక ఇతర కాలేయ సమస్యలకు దారి తీస్తుందన్నారు. హెపటైటిస్ ఎక్కువగా మలంతో కలుషితమైన నీరు తాగడం, ఆహారం తినడం, వ్యాధి సోకిన వ్యక్తిని ప్రత్యక్షంగా తాకడం వల్ల వస్తుందన్నారు.

హెపటైటిస్ బి ఇలా వ్యాపిస్తుంది..

కాన్పు సమయంలో తల్లి నుంచి బిడ్డకు, పిల్లలకు పిల్లలు కాంటాక్ట్‌లో ఉండటం, కలుషితమైన సూదులు, సిరంజీలు, పచ్చబొట్టు పొడిపించుకోవడం, గుచ్చడం, ఇన్ఫెక్షన్ సోకిన రక్తం, శరీర ద్రవాలు తగలడం (ఉదాహరణకు, సెక్స్ సమయంలో), హెపటైటిస్ సీ, డీ ఇన్ఫెక్షన్ సోకిన రక్తాన్ని తగలడం ద్వారా కూడా వ్యాపిస్తుంది. హెపటైటిస్ బీ ఉన్న వ్యక్తులు మాత్రమే హెపటైటిస్ డీ బారిన పడతారన్నారు. హెపటైటిస్ బీ కారణంగా దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్న దాదాపు 5శాతం మంది విషయంలో ఇది జరుగుతుందన్నారు. హెపటైటిస్-ఈ అనే వ్యాధి కలుషిత ఆహారం తినడం, కలుషిత నీరు తాగడం వల్ల సోకుతుందన్నారు.

హెపటైటిస్ లక్షణాలు..

జ్వరం, అలసట, ఆకలి లేకపోవడం, అతిసారం, వికారం, పొట్ట చుట్టూ నొప్పి, ముదురు రంగు మూత్రం, లేత రంగు మలం, కామెర్లు (చర్మం పసుపు రంగులోకి మారడం, కళ్లు తెల్లగా మారడం) కాకపోతే, హెపటైటిస్‌తో బాధపడుతున్న చాలా మందిలో వీటికి సంబంధించిన తేలికపాటి లక్షణాలు మాత్రమే కనిపిస్తాయి. కొన్నిసార్లు అసలు కనిపించవు కూడా. దీనివల్ల ప్రమాదం ఏమిటంటే, వాళ్లకు తెలియకుండానే వాళ్ల ఇన్ఫెక్షన్ మరొకరికి సోకవచ్చు.

హెపటైటిస్ ఏ, బీ బారిన పడకుండా నిరోధించడానికి టీకాలు ఉన్నాయన్నారు. పుట్టినప్పుడు శిశువులకు ఇచ్చే హెపటైటిస్ బీ వ్యాక్సిన్ తల్లుల నుంచి పిల్లలకు వ్యాధిని సంక్రమించకుండా నిరోధిస్తుంది. ఇది హెపటైటిస్ డీ నుంచీ రక్షిస్తుందని వివరించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని దుర్గం గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో సర్పంచు సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో అనంతపురం ఆదిత్య ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రాజశేఖర్ స్వరూప్, ప్రవీణ్‌కుమార్, శ్వేత, శాంతిస్వరూప్ ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. వీరితో బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యం అందించి మందులు మాత్రలు అందజేశారు. తర్వాత ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఆసుపత్రి యాజమాన్యం, గ్రామస్తులు వడ్డీ నారాయణస్వామి, రామాంజనేయులు, పవన్‌కుమార్, చాకలి నాగేష్, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎస్ఆర్ టెక్స్‌టైల్స్ ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మగట్ట

ఎస్ఆర్ టెక్స్‌టైల్స్ దుకాణం, యజమాని రమేష్

మండల పరిధిలోని గోనబావి గ్రామానికి చెందిన రమేష్ రాయదుర్గంలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ టెక్స్‌టైల్స్‌ను విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తాను గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామంలో జన్మించి గ్రామంలోనే చిన్న చిన్న వ్యాపారాలు చేసేవాడిని అన్నారు. ఇందులో బాగంగా హోటల్ కూడా నడిపానన్నారు. అయితే తాను నమ్ముకున్న శ్రమ, అంకితభావం తనను ఇంత స్థాయికి తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్స్ దుకాణంలో అన్ని వయసుల వారికి హోల్‌సేల్ ధరలకు అన్ని రకాల వస్త్రాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు.

నేడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వర్ధంతి

పామిడి : కమ్యూనిస్టు పోరాట యోధుడు తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతి సభను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించనున్నట్లు ఎపి రైతు కూలిసంఘం జిల్లా కార్యదర్శి పామిడి గజ్జల దస్తగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం అంటే ముందు గుర్తుకొచ్చే పేరు నాగిరెడ్డి అన్నారు. 1917లో శింగనమల మండలం తరిమెల గ్రామంలో పుట్టిన ఆయన ఎమర్జెన్సీ నిర్బంధ కారణంగా సరైన వైద్యం అందక 1976 జూలై 28న మరణించారన్నారు. ఆయన జీవితమంతా నిరుపేద బడుగు, బలహీన వర్గాల కోసం అర్పించారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒక్కసారి ఎంపీగా గెలిచి చట్టసభల్లో ప్రజల పక్షాన శక్తివంతంగా తన గళాన్ని వినిపించారని గుర్తు చేశారు. అలాంటి ఆయన వర్ధంతి సభకు జిల్లా ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అన్నదానం

పామిడి : డివి గంగాధర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్నేహితులు ఆదివారం స్థానిక పెన్నానది ఏటిగట్టున ఉన్న గంగమ్మ ఆలయంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మిత్రుడు ఆరోగ్య మిత్ర బాబు మాట్లాడుతూ తమ మిత్రుని మరణం సమాజ ప్రేరణ దిశగా కదిలించిందన్నారు. ఇందులో భాగంగానే దాదాపు 14ఏళ్లుగా మిత్రుడి జ్ఞాపకార్థం అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవి, విజయ్, హుస్సేన్, వలి, రాము, మంజు, గోపీ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గుత్తి : మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గుత్తిలో నిర్వహించారు. ఇందులో భాగంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయిబాబు, నాయకులు షేక్షావలి, నారాయణరెడ్డి, గోవిందప్ప, నారాయణ శెట్టి, శామ్యూల్, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సమస్యకు పరిష్కారం

శింగనమల : మండల కేంద్రంలో బిసి బాలికల హాస్టల్‌లో ఆవరణలో ఉన్న ముళ్లపొదలను టిడిపి నాయకులు ఆదివారం శుభ్రం చేయించారు. ఈనెల 5వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి సమస్యపై విద్యార్థులను వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సొంత నిధులతో బాలికల హాస్టల్ ఆవరణను జెసిబి ద్వారా శుభ్రం చేయించారు. దీంతో విద్యార్థినులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థులు

అనంతపురం : అనంతపురంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 1996-97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. దేశ విదేశాల్లో స్థిరపడిన వారితో పాటు వివిధ జిల్లాలో ఉన్న కొందరు విద్యార్థులు ఒక చోట చేరుకుని ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం, కరచాలనం చేసుకుంటూ నిక్‌నేమ్‌లతో పిలుచుకున్నారు. పాఠశాల రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గడిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

పెద్దవడుగూరు : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగి గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. ఆదివారం మండలం కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉంటున్న గ్రామాల్లో చిచ్చుపెట్టకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం గ్రామాల వారీగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి బైండోవర్ కేసులు నమోదు చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ద్విచక్ర వాహనంలో చీరకొంగు ఇరుక్కుని ప్రమాదం

మసుదా బేగం (పాతచిత్రం)

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై కదరంపల్లి గ్రామం వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం చక్రంలో చీర కొంగు ఇరుక్కుని చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మసుదాబి (55) మృతిచెందింది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి గ్రామానికి చెందిన మసుదాబి తన మనవడు ఆసిఫ్‌తో ద్విచక్ర వాహనంలో కణేకల్ క్రాస్‌కు వెళ్తుండగా కదరంపల్లి వద్దకు రాగానే చీర కొంగు వాహనం చక్రంలో ఇరుక్కుంది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. వెనుక కూర్చొన్న ముసుదాబి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మోటార్ సైకిల్ నడుపుతున్న ఆసిఫ్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

మద్యం పట్టివేత

పుట్లూరు : మండల పరిధిలోని ఎస్ గూడూరు గ్రామానికి చెందిన అంబటి రఘునాథరెడ్డి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడు సమాచారం రావడంతో వెంటనే రఘునాథరెడ్డిని అదుపులో తీసుకొని అతని వద్ద ఉన్న 90 బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట్ నరసింహ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.